# గొలుసు కథ -7

వెంకోజీ, శర్మ, రామకృష్ణ క్షణంలో భాస్కర్ దగ్గరకొచ్చి, దెబ్బలు తగలకుండా అతని చేతులు, కాళ్ళు పట్టుకున్నారు.

'భాస్కర్! రేయ్! భాస్కర్!'' అంటూ గట్టిగా కుదిపారు. ఇంకా 'ఫైర్ - ఫైర్' అంటూన్న భాస్కర్ త్రుళ్ళిపడి లేచాడు.

''భాస్కర్! యేమైందిరా! ఫైర్ - ఫైర్ అని కేకలు పెడుతున్నావు?'' అడిగాడు శర్మ.

అప్పటికిగానీ, మామూలు స్థితికి రాలేదు భాస్కర్ ''యేం లేదురా! ఆ దిష్టి బొమ్మలతోవో పీడకలొచ్చింది!'' అంటూ జరిగింది వివరించాడు. ''పోలీసు బుద్ధిపోనిచ్చుకున్నావుకాదు'' అని అంతా నవ్వుకుని మళ్ళీ విశ్రమించారు.

*** ***

ఉదయంలేచి, అంతా ఎస్టేట్ చూచారు. రకరకాల పక్షులు, కొన్నిజంతువులు అక్కడ పెంచబడుతున్నాయి. వాటికి రాజేష్ స్వయంగా మేత పెడుతున్నాడు. అతని భుజాన వో తుపాకి కూడా వుంది.

అంతా అయ్యాక, గన్‌తో చింతచెట్టుమీదనున్న రెండు గువ్వలను కాల్చాడు రాజేష్! అది చూచి మిత్రులంతా విస్తుపోయారు.

''ఓ పక్కన పక్షులను పెంచుతూ, మరో పక్కన పక్షులను కాల్చారేమిటి?'' వెంకోజీ అడిగాడు.

''అది నాకు సరదా'' రాజేష్ అన్నాడు.

''పెంచడమా? కాల్చడమా?''

''రెండూ! ప్రేమ కల్గినప్పుడు పెంచుతాను! కోరిక పుట్టినప్పుడు వేటాడుతాను? ఇవాళ మీ విందు కోసం చంపాను! దట్సాల్!''

ఆ మాటలకు కాస్త బాధ పడ్డారు మిత్రులు.

''అది రాయల్ బ్లడ్‌రా! దాంట్లో ప్రేమా వుంది! వేటా వుంది! మీరింకేం పట్టించుకోకండి!''భాస్కర్ అన్నాడు. ఆ మాటలకు వెంకోజీ భాస్కర్‌కేసి నిశితంగ చూచాడు.

ముగ్గురూ స్విమ్మింగ్‌పూల్‌లో స్నానాలు చేశారు. లానులో కుర్చీలు వేసుకొని, ఫలహారాలు సేవించారు. యెస్టేటుచుట్టూ మరోసారి నడక ప్రారంభించారు.

''రాయల్‌బ్లడ్ వున్న వాళ్ళు మనకు ప్రధాని అయితే, యిష్టమైన వాళ్ళకు పదవులిస్తారు. కష్టమైన వాళ్ళని 'సఫా' చేసేస్తారు!'' వెంకోజీ అన్నాడు.

''ఎందుకు చేస్తారు?'' భాస్కర్ తీవ్రంగ చూచాడు.


''రాజవంశీకులు గనుక! నువ్వే అన్నావుగ! ప్రేమా వుంటుంది, వేటా వుంటుందని!''

''అరె! అది ఇన్‌హెరిటెన్స్‌రా! వారికి వంశ పారంపర్యంగా వస్తున్న అలవాటు!...... అంతెందుకు! ఒకే స్త్రీ జాతి అయినప్పటికీ, మనం అమ్మని ఒకలా, చెల్లిని ఒకలా, భార్యని ఒకలా చూడడంలేదూ? అంతే!'' భాస్కర్ అన్నాడు.

''యేమన్న చెప్పు భాస్కర్! నామనస్సెందుకో యీ 'ప్రేమ - వేట' సిద్ధాంతాన్ని ఒప్పుకోడంలేదు! పశు పక్ష్యాదులని పెంచేవారు, వాటిని వేటాడడం సబబు కాదు! వేట ముఖ్యమనుకున్నవారు! వాటిని పెంచకూడదు!'' వెంకోజీ అన్నాడు.

''కరెక్టే! ఈయన పెంచడం మానేయాలి!'' శర్మ అభిప్రాయం.

''ఒరేయ్ మనమేదో ఒక రోజు వుండి పోయే వాళ్ళం! మనకెందుకీ గొడవలు? ఈవాళ పెంచడం




మానేయాలంటున్నారు. రేపుతినటం కూడా మాన మనేలా వున్నారు! నోరు మూసుకు పదండి!'' రామకృష్ణ కోప్పడ్డాడు.

అంతా మారు మాట్లాడక, బంగళాకేసి నడిచారు.

*** ***

భోజనాలు చేసి, అంతా పేకాడుతూ కూర్చున్నారు. ఆట జోరుగా సాగుతూంది.

అంతలో బోనులోనించి యెలా తప్పించుకుందో, కోతి లోపలికొచ్చింది. రావడమేమిటి, రాజేష్ గన్ చేతబట్టుకోవడమేమిటి అంతా క్షణాల్లో జరిగి పోయింది.

పైగా, దానిలో తూటాలు కూడా లోడ్ చేయబడి వున్నాయి. అది తిన్నగా వచ్చి, తుపాకీని రామకృష్ణ వీపుకానించింది.

ఉలిక్కిపడి చూచి, కేకలు పెడుతూ లేచి పారిపోయాడు.

ఆ కోతి తుపాకిని పైకెత్తి, ట్రిగ్గర్ మీద చెయ్యిపెట్టి మిగతావారికేసి చూచింది. అంతా భయపడి గదిలోకి పారిపోయి, తలుపులు వేశారు.

కమిషనర్ భాస్కర్ మాత్రం ఒక స్థంభం చాటుకి చేరాడు.

రాజేష్ యువతలకు జరిగి, కోతిని ''గాంధీ'' అని పిలిచాడు. అది అతనికేసి చూచింది. ''రా! యిలారా! ఆ తుపాకీని పారెయ్!'' గదిమాడు.

అది, నోరు విప్పి వెక్కిరించింది. అతనికి తుపాకీని గురిపెట్టింది.

మళ్ళీ మళ్ళీ పిలిచి; హెచ్చరించాడు. కానీ, అది అతని మాటల వినలేదు.

అంతలో యెలా నొక్కిందో! 'ఢం' అని గన్ పేలింది. కోతి భయపడి, తుపాకీ వదిలి పారిపోయింది. కానీ, ఆ గుండు, రాజేష్ కాలికి తగిలి, 'అమ్మా' అంటూ, కిందపడ్డాడు.

''రాజేష్'' అని బిగ్గరగా అరచి, భాస్కర్ ముందుకు దూకాడు. కిటికీలలోనుండి చూచిన వెంకోజీ తదితరులు కూడా క్షణంలో తలుపులు తెరుచుకొని, రాజేష్ వద్ద కొచ్చారు.

డ్రైవరూ, వంటవాడు కూడా అయ్యగారూ అంటూ వచ్చి పడ్డారు. అంతా కలిసి, రాజేష్‌ని కార్లో యెక్కించారు. భాస్కర్ అతని కాలికి కట్టుకట్టడం వల్ల రక్తస్రావం ఆగింది.

కారు 'మేడ్‌చల్' గవర్నమెంటు హాస్పిటల్


కారిడార్‌లో కొచ్చి ఆగింది. రాజేష్‌కి అవసరమైన ఆపరేషన్ జరిపి, తుపాకీ గుండును తొలగించారు.

ఈలోగా, సుబ్బారావుగార్కి యీ విషయం తెలుప బడింది.

రాజేష్‌ని తిరిగి యెస్టేటుకి పంపారు. డాక్టరు డైలీ వచ్చి, చూచి వెళ్తానన్నాడు.

రాజేష్ తల్లి అతనిని చూచి కన్నీళ్ళు పెట్టుకుంది. సుబ్బారావుగారు జరిగింది తెలుసుకొని, ఉగ్రుడై పోయాడు. "అనేక సార్లు చెప్పాను, జంతువులతోటి, పక్షులతోటి మనకెందుకురా అని! వింటేనా? హిచ్ కాక్ సినిమా 'ది బర్డ్స్' లోలా యెప్పుడో పక్షులే పొడిచి చంపేస్తాయిరా అని మొత్తుకుంటున్నా! ఈలోగా కోతే చేసిందపని! పైగా, వీడు దానికి పెట్టిన ముద్దు పేరు 'గాంధీ' యెవరన్నా వింటే నవ్వుతారని కూడా లేదు వాడికి!...... రేయ్! యెవ్వరా అక్కడ?...... వెళ్ళి, ఆ పక్షుల్ని, జంతువుల్ని వెంటనే వదిలి పెట్టండి! ఇక మీదట అలాంటివేవీ పెంచడానికి వీల్లేదు! తెలిసిందా?" ఆజ్ఞాపించాడు

"క్షణాల్లో తుపాకీ పేల్చిన 'గాంధీ' పుణ్యమాని అక్కడ బంధీలుగా వున్న పక్షులకు, జంతువులకు



స్వాతంత్ర్యం వచ్చింది. ఏ రూపంలో వున్నా 'గాంధీ' అంటే 'స్వతంత్రత' అని మరోసారి ఋజువైంది!" వెంకోజీ ఆనందంగా అన్నాడు.

రాజేష్‌కి సంభవించిన ప్రమాదం వల్ల కార్యక్రమాన్ని రద్దు చేసుకొని, ప్లిమత్‌లో నలుగురు మిత్రులు సిటీకి వెళుతున్నారు.

"రాజేష్ 'రాయల్ బ్లడ్' లక్షణాలతోపాటు, కోతి 'మంకీ బ్లడ్' లక్షణాలు కూడా మనకు అర్థమయ్యాయి!" శర్మ అన్నాడు.

"అసలా పెంపుడు కోతి అలా యెందుకు చేసిందీ నాకు అంతు పట్టడంలేదు!" రామకృష్ణ అన్నాడు.

'అదే గమ్మత్తు! అక్కడో చిన్న తిరకాసుంది!"




వెంకోజీ నవ్వుతూ అన్నాడు.

"వాడ్డాయూ మీన్?" భాస్కర్ చిరాగ్గా అడిగాడు.

"ఆలోచించండి! మీకే తెలుస్తుంది!" వెంకోజీ అన్నాడు.

పై వారం